# నాట్యం చేసిన నగరం

దూరం నుంచి మోటార్ బోట్ వస్తున్న శబ్దం వినిపించింది.

ఆ శబ్దం అంతకంతకీ దగ్గర కాసాగింది.

డాక్టర్ రమేష్ బైనాక్యులర్స్ తీసుకొని టెర్రేస్ మీదకెళ్ళాడు.

సందేహం లేదు. అది మోటార్ బోట్, సముద్రంలోంచి వేగంగా తన లెగూన్‌లోకి వస్తోంది.

రమేష్‌కి ఒక్కసారి ఒళ్ళు గగుర్పొడిచినట్లయింది.


ఈ ఐదు సంవత్సరాలలో పరమానవుడెవరూ ఆ ఛాయలకు రాలేదు. అందువల్ల అంతకాలం తర్వాత మనుష్యులని చూడబోతున్న ఆనందం ఒకప్రక్క.

కాని ఆ వచ్చేవాళ్ళెవరు. ఎందుకొస్తున్నారు అన్న భయం మరోప్రక్క. ఆ అనుభూతుల నుంచి తేరుకోకుండానే ఆ మోటార్ బోట్ అక్కడికి వచ్చి ఆగింది.

అందులోనుంచి మాసినగడ్డం,రేగినజుట్టుతో ఒక నడివయస్కుడు దిగాడు. తిన్నగా రమేష్ దగ్గరికి వచ్చాడు.

"నా పేరు రామానుజం. ముత్యాల వ్యాపారం చేస్తాను. వాటిని దిగుమతి చేసుకొని అమ్మడం నా వ్యాపారం. దానిని చూసుకోడానికి నా మనుష్యులున్నారు. స్వాభావికంగా ముత్యాలు దొరికే ప్రదేశాలకి వెళ్ళి కొత్త కొత్త రకాల ముత్యాలను కనుగొనడం నాహాబీ. ఆ అన్వేషణలో ఇటు వస్తున్న నాకు దూరాన్నుంచి బైనాక్యులర్స్‌లో చూస్తుంటే మీరున్న ఈ ఇల్లు కనిపించింది. ఈ నిర్జన ప్రదేశంలో ఇల్లు ఉండడం చూసి ఆశ్చర్యపోయాను. ఇందులో ఉండేవారితో పరిచయం కావడంతో పాటు ఈ లెగూన్‌లో కొత్తరకం ముత్యాలు దొరుకుతాయేమో చూడవచ్చునన్న ఉద్దేశంతో ఇటు వచ్చాను" అంటూ ఏకబిగిన చెప్పుకుపోయాడు ఆ వ్యక్తి.

"నా పేరు రమేష్. మెరైన్ బయాలజీలో డాక్టరేట్ పొందాను. మనదేశంలో కోరల్స్ ఉండే ప్రాంతాలు ఇంచుమించు లేవనే చెప్పవచ్చు. కాని నాగరిక ప్రపంచంతో సంబంధం లేని ఇక్కడ కోరల్స్, స్పాంజెస్, అయిస్టర్స్ వంటి ఎన్నో రకాల సముద్ర జీవాలున్న విషయం మా ప్రొఫెసర్‌గారు చెప్పేవారు.



అయన ఇక్కడ పరిశోధనలు చేసే ఉద్దేశంతో ఇల్లు, లేబొరేటరీ కూడా కట్టుకున్నారు. ఆయనకి నేనంటే ఎంతో అభిమానం. అందువల్ల ఆయన ఊహలూ, ఉద్దేశాలూ నాకు చెప్తుండేవాడు. నోట్స్ నాకిచ్చేవాడు. అయితే ఆయన ఒక ఆక్సిడెంట్‌లో దుర్మరణం పొందడంతో ఆయన కృషి ఆగిపోయింది. కాని మ్మెరైన్ బయోలజీలో నాకున్న ఆసక్తికొద్దీ ఇక్కడికి వచ్చి గత ఐదేళ్ళుగా నేను పరిశోధనలు .జరుపుతున్నాను. నాకు చేదోడువాదోడుగా నా భార్య ఉంది. ఆమె నాకు భార్య, అసిస్టెంటూ, సెక్రెటరీ - అన్నీను. లోపలికి రండి. ఆమెను పరిచయం చేస్తాను. మా లేబొరేటరీని కూడా మీరు చూడవచ్చు" అంటూ ముందుకి నడిచాడు రమేష్.

అయన్ని మౌనంగా అనుసరించాడు రామానుజం.

"అనితా.... ఈయన రామానుజంగారు. ముత్యాల వ్యాపారం చేస్తారట" అంటూ పరిచయం చేశాడు.

"ఒక్క ముత్యాలే కాదమ్మా. హైదరాబాద్‌లో నాకు ఇంకా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్, హైర్‌పర్చేజ్, లీజింగ్- ఇలా చాలా వ్యాపారాలున్నాయి. కొత్తరకం ముత్యాలేమైనా దొరుకుతాయేమోనన్న ఆశతో ఈ ప్రాంతంలో వెతకడానికి వచ్చాను" అంటూ మరికొన్ని వివరాలు చెప్పాడు రామానుజం.

"పరాయి మనిషి ముఖం చూసి ఐదేళ్ళు దాటింది. ఇన్నాళ్ళకి మిమ్మల్ని చూస్తుంటే అందులోనూ

మన తెలుగు వాళ్ళని చూస్తుంటే మరీ ఆనందంగా ఉంది. మీరు కొన్నాళ్ళు మాకు అతిథిగా ఉండాలి" అంది అనిత మర్యాదగా.

"అలాగేనమ్మా....ఇప్పుడు నేను వచ్చింది కొత్తరకం ముత్యాలు దొరికే ప్రాంతాలను అన్వేషించడానికేగా. మామూలుగా అయితే ఒక్కడినే ఉండి అన్వేషించేవాడిని. ఇప్పుడు మీరు కూడా ఉండడంతో నా పని మరింత సులువవుతుంది" అన్నాడు రామానుజం.

"ఓ తప్పకుండా... ఒక మారైన్ బయాలజిస్టుగా నేను మీకు మరింతగా సహాయపడగలను" అన్నాడు రమేష్.

"ఓ..... థ్యాంక్యూ..... అది సరే..... అయన సైంటిస్ట్ కనుక ఇరవై నాలుగ్గంటలూ పరిశోధనలలో మునిగితేలుతుంటాడనుకో ఇతరులతో ఉలుకూ పలుకూ లేకుండా నీకు కాలక్షేపం ఎలా అవుతుం దమ్మా?" అని అడిగాడు రామానుజం.

"ప్రతి విషయంలోనూ ఆయనతో పాలుపంచుకోవడంతో అసలు నాకు సమయమే తెలియ దండీ" అంది అనిత సిగ్గుపడుతూ.

"తర్వాత మాట్లాడుకొందాం. ముందు శుభ్రంగా స్నానం చేసి సుష్టుగా భోజనం చేసి, హాయిగా విశ్రాంతి తీసుకోండి" అన్నాడు రమేష్.

"ఓ... కె.." అంటూ తమ సామాను తెచ్చుకోడానికి మోటార్ బోట్‌వైపు వెళ్ళాడు రామానుజం. అది అతని సొంత బోటు. కావలసిన చోటుకల్లా వెళ్తుంటాడు.

గోవా, పశ్చిమాన అరేబియా సముద్రతీరాన ఉంది. గోవానుంచి బొంబాయి పైవరకూ అరేబియా సముద్రంలో ఎన్నో దీవులు ఉన్నాయి. వీటిలో నిజానికి కొన్ని సముద్రంలో ఉన్న కొండల శిఖరాలు. పెద్ద పెద్ద చెట్లతో, దట్టమైన పొదలతో, అందమైన లోయలతో ఎంతో సుందరంగా ఉంటాయి. వీటిలోని చాలా దీవులు. తీరాన్నుంచి కనిపిస్తూనే ఉంటాయి. మరికొన్ని చాలా దూరంగా ఉన్నాయి. అయితే ఈ దీవుల్లో మనుష్యులు నివసిస్తున్నవి చాలా తక్కువ. తీరానికి దగ్గరగా ఉన్న కొన్నింటిలో మాత్రమే కొందరున్నారు. వాళ్ళే ప్రధానంగా బెస్తవారు.

రమేష్ ఉన్న దీవి గోవా తీరానికి సుమారు యాభై మైళ్ళదూరంలో ఉంది. దాని వైశాల్యం సుమారు వంద చదరపు కిలోమీటర్లుంటుంది. ఆ దీవి ప్రత్యేకత ఏమిటంటే రెండు కొండలు పక్కపక్కగా వచ్చి దీనిలో ఒక చివర్న కలుసుకుంటాయి. ఈ రెండు కొండల మధ్య సముద్రం సుమారు నాలుగు కిలోమీటర్లు లోనికి చొచ్చుకొచ్చి ఉప్పునీటి మడుగయింది. ఇట్టివాటిని "లెగూన్" అంటారు. ఈ లెగూన్‌లోని మరో ప్రత్యేకత ఏమిటంటే ఇందులో కోరల్ ఫార్మేషన్స్ చాలా ఉన్నాయి. కోరల్స్‌ని తెలుగులో "పగడాలు" అంటారు. ఇవి సూక్ష్మజీవాలు. వీటిలో చిన్న గులకరాళ్ళు సైజునుంచి పెద్ద పనసకాయ పరిమాణంలో కూడా ఉంటాయి. కాల్షియం లవణాలు (సున్నం)తో తయారయ్యే వీటిపైన వలయాలు వలయాలుగా అకారాలు ఏర్పడి చూడడానికి ఎంతో అందంగా ఉంటాయి కోరల్స్. వీటిలో రకరకాల రంగులూ, అకారాలు ఉంటాయి. మనం దండలుగా గుచ్చుకునే పగడాలు వంటి విలువైన వస్తువులతో వ్యాపారం చేసే ఉద్దేశం లేదు. రమేష్‌కి రకరకాల సముద్రజీవాల మీద పరిశోధనలు చేయడమే అతని లోకం- ప్రపంచం. అయితే

అతనికి ప్రత్యేకంగా ఆసక్తి కల్పించినవి కోరల్స్. వాటిలో కొత్తకొత్త రంగులున్న వాటిని సృష్టించడం, అతిపెద్ద ప్రమాణంలో తయారుచేయడం అతను స్పెషలైజ్ చేసిన పరిశోధన. వాటిలో అతను విజయం సాధించాడు కూడా.

నర మానవులు లేని ఈ దీవిలో తన ప్రొఫెసర్ నెలకొల్పిన లేబొరేటరీలో పరిశోధనలు కొనసాగిస్తున్నాడు రమేష్. బయట ప్రపంచంతో సంబంధాన్ని కలిపేది అతనికున్న మోటార్‌బోట్ ఒక్కటే. ఇంటికి కావలసిన వస్తువులు, లేబొరేటరీకి కావలసిన సామాన్లు తెచ్చుకోవలసి వచ్చినపుడు మాత్రం మోటార్ బోట్‌లో మార్మగోవా వెళ్ళి వస్తుంటాడు. అక్కడే అతని బ్యాంక్ అకౌంట్ ఉంది. వారసత్వంగా వచ్చిన ఆస్తిని అమ్మి ఆ డబ్బును ఫిక్సెడ్ డిపాజిట్‌గా బ్యాంక్‌లో వేశాడు. దానిమీద వచ్చే వడ్డీతో అతని అవసరాలన్నీ గడిచిపోతుంటాయి. అయితే ఏ కారణం చేతనో అనిత మాత్రం ఎప్పుడూ అతనివెంట వెళ్ళలేదు. ఈ ఐదేళ్ళలో ఆమె, భర్తని తప్ప మరో మనిషిని చూసింది లేదు. ఇన్నాళ్ళకి రామానుజం కనిపించాడు.

భోజనాలయ్యాక ఒక గంటసేపు హాయిగా నిద్రపోయి లేచాడు రామానుజం. అతను నిద్రలేవగానే డాక్టర్ రమేష్ తన లేబొరేటరీలోకి తీసుకెళ్ళాడు.

డాక్టర్ రమేష్ ఇల్లు తీరంమీద నీటికి బాగా దగ్గరగా ఉంది. లేబొరేటరీ క్రింద సెల్లార్ పోర్షన్ ఉంది. అక్కడి నుంచి అది నీటిలోకి సుమారు నలభై అడుగుల దూరం చొచ్చుకొనిపోయి ఉంది. అంటే ఆ లేబొరేటరీకి పైనా, క్రింద మూడువైపుల అంతా నీరేనన్నమాట. నీటిలో పూర్తిగా ఒకవైపు పెద్ద అద్దం ఉంది. దానిలోంచి నీటిలో తిరుగాడే చేపలూ, ఇతర జీవాలూ, నేలని అంటివున్న కోరల్స్, బండరాళ్ళు అంటుకుని వున్న ముత్యాలచిప్పలు, ఆలిచిప్పలు వంటివి ఎంతో అందంగా కనిపిస్తుంటాయి.

లాబొరేటరీలో మధ్యగా పెద్దటేబుల్ మీద పెద్ద గ్లాస్‌కేస్ ఉంది. అందులోని కల్చర్ మీడియంలో పెరుగుతున్న కోరల్స్ ఉన్నాయి.

అవన్నీ చూసేసరికి రామానుజానికి ఎంతోఆనందం కలిగింది.

“ఇవన్నీ చూస్తుంటే - మనవాళ్ళు పాతాళలోకం అంటారే - దాంట్లో ఉన్నట్లనిపిస్తోంది” అన్నాడు ఆయన.

“ఇదుగో చూశారా. ఇది అతిసాధారణంగా లభ్యమయ్యే కోరల్. దీనికి అతి అందమైన నీలం రంగు వచ్చేటట్లు చేయగలిగాను.” అంటూ గ్లాస్‌కేస్‌లో ఉన్న ఒక కోరల్‌నుచూపించాడు రమేష్.

నిజంగా ఆ బ్లూషేడ్ అద్భుతంగా ఉంది. అంతటి నునుపు నిగారింపు ఉన్న నీలంరంగుని అతను ఎప్పుడూ చూడలేదు.

“అద్భుతం” అన్నాడు రామానుజం.

“అంతేకాదు ఈకోరల్‌ని నిమిషాల మీద అతి పెద్దగా ఎదిగేటట్లు చేయగలిగాను. చూడండి.” అంటూ అగ్లాస్ కేస్ తెరిచి అందులోంచి ఒక చిన్నకోరల్ ముక్కని తీశాడు. దానిని ఒక పెద్ద బీకర్‌లో వుంచి దాని మీద ఏదో ద్రవం పోశాడు.

చూస్తుండగానే ఆ కోరల్ అన్నివైపులా ఉబ్బసాగింది. పదినిమిషాలు పట్టకుండా గురువిందగింజ పరిమాణంలో ఉన్న ఆ కోరల్ ఇంచుమించు బీకర్‌ని నింపేసింది.

"ఎంత విచిత్రం! ఇది ఎలా సాధ్యం!" అన్నాడు రామానుజం ఆశ్చర్యం పట్టలేక.

"ద్రాక్ష వంటి మొక్కలకి జిబరెల్లిక్ యాసిడ్ వంటి హార్మోన్‌లను వేస్తే విపరీతంగా పెరుగుదల కలిగి మంచి పెద్ద సైజులో కాపువస్తుందన్న విషయం మీకు తెలుసుగా. అదే విధంగా ఈ కోరల్ పెరుగదలను విపరీతంగా ప్రేరేపించగల హార్మోన్‌ను ఒకదానిని నేను కనిపెట్టాను. దీనిని ఉప్పు, సున్నం ఉన్న నీటిలో కలిపితే కావలసిన కల్చర్ మీడియం తయారవుతుంది. దీనిలో వేసిన కోరల్ సున్నంలోని కాల్షియం కార్బొనేట్, ఉప్పులోని సోడియం క్లోరైడ్‌లను తీసుకుని హార్మోన్ ప్రభావంతో నిమిషాలమీద విపరీతంగా పెరిగిపోయింది" అంటూ వివరించాడు రమేష్.

రామానుజం విభ్రాంతి నుంచి కోలుకోక ముందే మళ్ళీ ఆ కోరల్‌ని బీకర్‌లో నుంచి బయటకు తీసి "దానిని నొక్కి చూడండి" అన్నాడు రమేష్.

రామానుజం దానిని నొక్కి చూశాడు. అది మెత్తగా రబ్బర్‌లాగా ఉంది.

"మామూలుగా కోరల్ గుల్లగా, కొంచెం పెళుసుగా ఉంటుంది. కాని ఇది రబ్బర్ ప్లాస్టిక్ లాగా మెత్తగా ఉంది." అన్నాడు రమేష్.

"అయితే దీనితో రబ్బర్ ప్లాస్టిక్ వంటి వస్తువులు చేయవచ్చా?" అన్నాడు రామానుజం.

"ఊహూ... ఇది జీవం ఉన్న కోరల్. జీవం ఉన్నది పెరుగుతూ ఉంటుంది...." అంటూ తల ఆడించాడు రమేష్.

రమేష్ ముఖంలోకి నిశితంగా, వింతగా చూశాడు రామానుజం.

రమేష్‌ని చూస్తుంటే అతనికి ఏదో స్ఫురణకి వచ్చింది. కాని అదేదో లీలగా అనిపించిందే కాని, ఖచ్చితంగా జ్ఞాపకానికి రాలేదు.

"మీ శాస్త్రజ్ఞులు భలేవాళ్ళు" అంటూ ఫక్కున నవ్వాడు రామానుజం ప్రశ్నార్థకంగా చూశాడు రమేష్.

"ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు న్యూటన్ దగ్గర ఒక పెద్దపిల్లి ఒకచిన్నపిల్లి ఉండేవట. అవి ఎక్కడెక్కడో షికార్లు కొట్టి ఏ అర్ధరాత్రో కొంపకి జేరేవట. అయితే ఆ సమయంలో తలుపులు వేసి ఉంటాయి కనుక, తలుపు దగ్గరే మ్యావ్‌మ్యావ్ అంటూ కూర్చొనేవట. వాటి బాధచూడలేక న్యూటన్ అవి సులువుగా ఇంట్లోకి రావడానికి తలుపుకి ఒకపెద్దకన్నం మరోచిన్నకన్నం చేయమని వడ్రంగికి చెప్పాడట. రెండు కన్నాలెందుకు? పెద్దకన్నం ఒక్కటీ చేస్తే అందులోంచే రెండూ రాగలవు కదా అని వడ్రంగి ఎంత చెప్పినా న్యూటన్‌కి బోధపడలేదట. అప్పుడు ఆ వడ్రంగి ఒక్కటి పెద్దకన్నం చేసి అందులోంచి రెండు పిల్లుల్ని పంపి "పెద్దపిల్లి దూరగల కన్నంలో చిన్నపిల్లి దూరలేదా?" అని అడిగాడట. అప్పుడు కాని న్యూటన్‌కి ఆ విషయం అర్థంకాలేదట. అలా ఉంటాయి ఒక్కొక్కసారి మహామేధావుల తెలివితేటలు" అన్నాడు రామానుజం ఒక చిన్న సైజు ఉపన్యాసం దంచుతూ.

"ఇప్పుడు ఆ పోలిక ఎందుకు తెచ్చినట్లు?" అన్నాడు. రమేష్ ముఖం ముడుచుకుని రామానుజం అంతగాచనువు తీసుకోవడం అతనికి నచ్చలేదు.

"లేకపోతే ఏమిటి చెప్పండి మిస్టర్ రమేష్. కోరల్‌కి జీవం ఉన్నది కనుక పనికి రాదన్నారు. రబ్బర్ ప్లాస్టిక్‌గా మారాక ఆ కోరల్‌ని చంపితే పోదా?" అన్నాడు రామానుజం.

"మొత్తం మీద వ్యాపారస్థులనిపించారు" అని మాటకి మాట అంటించాడు రమేష్. "కోరల్‌ని చంపడం మీరనుకొన్నంత సులభం కాదు. అది చచ్చినట్లనిపించినా పరిస్థితులు అనుకూలిస్తే తిరిగి బ్రతకగలదు. ఆఫీస్‌టేబుల్ మీద పెట్టుకునే స్పాంజిని ఎండలో మలమల మాడ్చి సుత్తితో నుగ్గునుగ్గుగా కొట్టండి. ఇంత చిత్రహింస చేశాక అది నిజంగా చచ్చిపోయుండాలి. అవునా? దానిని తీసుకెళ్ళి నీటిలో వేయండి. దానికి ప్రాణం వచ్చి తిరిగి ఎదుగుతుంది. కోరల్ కూడా ఇటువంటిదే. అది చచ్చిపోయిందనిపించినా, అనుకోకుండా ఎప్పుడైనా తిరిగి బ్రతకవచ్చు" అన్నాడు రమేష్.

"ఇంతటి విచిత్రమైన జీవా ఇది!" అన్నాడు రామానుజం ఆశ్చర్యంతో.

"మీ వ్యాపారస్థులకి ఆసక్తి కల్పించే మరో విశేషం ఇప్పుడు మీకు చూపిస్తాను" అంటూ రమేష్ ఆ మెత్తటి కోరల్‌ని తీసి మరో పెద్ద బీకర్‌లో వేసి, ఇంకేదో ద్రావణం దాని మీద పోశాడు. కొన్నినిమిషాల తర్వాత దానిని తీసి "ఇప్పుడు నొక్కి చూడండి" అంటూ రామానుజం ముందుంచాడు.

రామానుజం దానిని నొక్కి చూశాడు. ఆయన ఆశ్యర్యానికి అంతులేదు. అది గట్టిగా రాయిలా ఉంది.

ఆయన తేరుకోకముందే ఒక సుత్తిని చేతికిచ్చి "దీన్ని పగలకొట్టండి" అన్నాడు రమేష్.

రామానుజం ఆ సుత్తి వంక నిశితంగా చూసి, ఆ కోరల్‌ని నేలమీద పెట్టి సుత్తితో బలంగా కొట్టాడు, సుత్తి ఖంగ్‌మందే కాని కోరల్‌మాత్రం విరగలేదు.

రామానుజం ఆశ్చర్యానికి అంతులేదు.

"అయితే ఇప్పుడిది చచ్చిపోయిందా?" అని అడిగాడు.

"అనే అనుకుంటున్నా ఖాయంగా చెప్పలేను. ఎందుకంటే దీనిలో జీవం ఎంతకాలం నిద్రాణస్థితిలో ఉండగలదో, ఏ పరిస్థితులలో తిరిగి పైకిరాగలదో నాకు సరియైన అవగాహన ఇంకాలేదు. ఆ విషయమై నేను ఇప్పుడు పరిశోధనలు చేస్తున్నాను" అన్నాడు రమేష్.

రామానుజంలోని బిజినెస్ మాన్ మేల్కొన్నాడు. రమేష్ సాధించిన విజయాలలో, ఆయనకి తన బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వ్యాపారాన్ని ఆకాశపుటెత్తులకు తీసుకుపోగల అవకాశం కనిపించింది. ఆయన కళ్ళముందు కోట్లాది రూపాయలు కదలాడుతున్నాయి. ఆ అపూర్వ అవకాశం కల్పించబోతున్న రమేష్ వంక ఆశ్యర్యంతో ఆనందంతో తేరిపారచూశాడు.

ఆ క్షణంలో అప్పటివరకూ మనసులో ఏదో లీలగా కదలాడుతున్న రూపం, అసలు ఆకారంలో ఒక్కకసారి మెదిలింది. అతనికి ఏదో గుర్తుకి వచ్చింది.

"రమేష్‌గారూ,ఇంక మీరు ఈ పరిశోధనల్ని ఆపేయండి. మీరు నేనూ కూడా కోట్లకు పడగలెత్తే

మార్గం చూపుతాను. ఇంక ఈ అజ్ఞాత వాసంలోంచి బయటపడండి" అన్నాడు రామానుజం.

ఆమాట వినగానే గుండెగతుక్కుమంది రమేష్‌కి.

"మీరంటున్నదేమిటో నాకు అర్థంకావడం లేదు" అన్నాడు.

"ఏముందీ అర్థం కాకపోవడానికి, మీరు తయారుచేసిన ఈ హార్ట్ కోరల్‌తో ఇటుకలు, పాలిష్డ్ స్టోన్స్ ఒకటేమిటి మొత్తం ఇల్లు, రోడ్లు, మల్టీస్టోరీడ్ బిల్డింగ్స్ - నగరాలకి నగరాలనే నిర్మించవచ్చు. ప్రపంచ స్వరూపమే మారిపోతుంది. ఇద్దరం కలిసి హైదరాబాద్‌లోనో, ఢిల్లీలోనో మన ఆఫీసు ఓపెన్ చేద్దాం. ప్రతి రాష్ట్రంలోనూ ఫ్యాక్టరీలు పెడ్దాం. అవసరమైన పెట్టుబడిని నేను పెట్టాను. మెటీరియల్ తయారుచేసి ఇచ్చే పనిమీది మీ వాటాగా లాభాల్లో ఎనిమిదో వంతు ఇస్తాను. అదే కొన్నికోట్లు అవుతుంది" అంటూ కళ్ళు మూసుకుని తన్మయత్వంతో చెప్పుకుపోసాగాడు.

"నేను ఇందాకనే చెప్పాను. ఈకోరల్‌పై నా పరిశోధనలు ఇంకా జరుగుతున్నాయని. పరీక్షలు అన్నీ నిశితంగా సమగ్రంగా లోపరహితంగా జరిగితేనే కాని ఏ పదార్థాన్ని వ్యాపార సరళిలో ఉత్పత్తి చేయకూడదు. తొందరపడితే తెలియని ప్రమాదాలు ముంచుకురావచ్చు" అన్నాడు రమేష్.

"ఆలస్యం అయితే కోట్ల కొలది నష్టం. ఇంక ఏ పరిశోధనలూ అవసరం లేదు. వెంటనే వ్యాపారంలోకి అడుగుపెట్టండి. లేదా ఫార్ములా నాకు చెప్పండి. దానికి తగిన ప్రతిఫలం ఇస్తాను" అన్నాడు రామానుజం తొందరపెడ్తూ.

" అది మాత్రం జరగని పని. నా పరిశోధనలు పూర్తి అయితే కాని, వివరాలు ఎవరికీ చెప్పను" అన్నాడు రమేష్ దృఢంగా.

"అయితే విను మిస్టర్ రాజారావ్. నీ మీద పోలీస్ కేస్ ఇంకా పెండింగ్‌లో ఉన్న విషయం మరిచిపోకు. నిన్ను పోలీసులకు పట్టియ్యడం నిమిషం సేపుపని" అని అంటూ రమేష్, అనితల ముఖంవైపు చూశాడు.

ఆ మాట వినగానే రమేష్ ముఖం పాలిపోయింది. అనిత ముఖాన కత్తివేటుకు నెత్తుటిచుక్క లేదు.

"మిస్ అనితా.... నీ అసలు పేరు సుజాత అన్న విషయం కూడా నాకు తెలుసు. మీ ఇద్దరూ డాం స్కాండల్ కేసులో వాంటెడ్ పీపుల్ అన్న విషయం మరిచిపోకండి" బెదిరింపు స్వరంతో అన్నాడు రామానుజం.

ఐదు సంవత్సరాల క్రితం మాట.

హైదరాబాద్‌లో "ట్వెంటీఫస్ట్ సెంచరీ కన్‌స్ట్రక్షన్స్" అనే భవన నిర్మాణసంస్థ ఉండేది. ఇది మల్టీ స్టోరీడ్ బిల్డింగ్సే కాక, మధ్యరకం డామ్‌లను కూడా నిర్మించడానికి కాంట్రాక్ట్ తీసుకొంటుండేది. అందులో రాజారావు ఒక పార్టనర్‌గా ఉండేవాడు. అక్కడే సుజాత స్టెనోగా ఉండేది. ఆమె అందచందాలకూ, సభ్యత సంస్కారాలు రాజారావుకి బాగా నచ్చాయి. అది క్రమేపీ ప్రేమగా పరిణమించి తర్వాత వారిద్దరూ ఒకింటి వారయ్యేలా చేసింది.

ఒకసారి అస్సాంలో ఒక మధ్యరకం డాం నిర్మించే కాంట్రాక్ట్ ఈ కంపెనీకి వచ్చింది. అంతపెద్ద పనిని అంతటి క్లిష్టమైన కార్యాన్ని చేపట్టడం అదే మొదటసారి. అయినా ధైర్యంతో కాంట్రాక్టుపనికి ఒప్పుకున్నారు వాళ్ళు. అయితే అనుభవం లేకపోవడంతో పాటు, మానేజింగ్ పార్ట్నర్ దురాశ మూలంగా కల్తీ సిమెంట్ వాడడం నిర్మాణంలో లోపాలుండడం మూలంగా, ఓసారి కురిసిన పెద్ద వర్షాలకి ఆ డామ్ కొట్టుకుపోయింది. దాంతో అది పెద్ద కేసై, సెంట్రల్ సి.బి.ఐ చేతుల్లోకి పోయింది. ఎప్పుడైతే డామ్ కూలిపోయిందో భయపడిపోయి కంపెనీ పార్టనర్స్ అందరూ కంపెనీని గాలికి వదిలేసి తలోదిక్కుకి పారిపోయారు. అప్పుడే రాజారావు సుజాతతో కలిసి తన గురువుగారైన ప్రొఫెసర్ గారి దగ్గర శరణుపొందాడు. ఆయన చనిపోయాక తమ పేర్లు రమేష్, అనితలని మార్చుకుని అజ్ఞాతవాసం గడుపుతూ పరిశోధనలు సాగిస్తున్నారు.. ఆ రోజుల్లో అందరు పార్టనర్స్‌తో పాటు రాజారావు ఫోటో కూడా ప్రముఖంగా పేపర్లలో పడింది. బిల్డింగ్స్ వ్యాపారంలో ఉన్న రామానుజానికి అందుకనే రాజారావు ముఖం బాగా గుర్తుండిపోయింది. పైగా రెండుమూడు సార్లు వాళ్ళ ఆఫీసుకు వెళ్ళడం, రాజారావుతో మాట్లాడడం కూడా జరిగింది. అప్పుడే అక్కడ సుజాతను చూశాడు. ఎటువంటి వారినైనా ఆకర్షించే సుజాతరూపం అతని మనసులో చెరగని ముద్ర వేసింది. అయితే ఎంతోమంది కస్టమర్స్‌ని కలుసుకుంటుండే రాజారావుకి, రామానుజం ముఖం ప్రత్యేకించి గుర్తులేదు. కాని రామానుజం మాత్రం వాళ్ళిద్దర్నీ సులువుగా గుర్తుపట్టాడు.

ఆ సంఘటనలన్నీ కళ్ళముందు గిర్రున తిరిగాయి వారిద్దరికీ.

"ఏమి నిర్ణయించుకున్నావు రాజారావు నేను చెప్పినట్లు మర్యాదగా నాతో వచ్చేసి కోటీశ్వరుడివికా నీ రహస్యం నేను ఎవ్వరికీ చెప్పను. నీకు ఏ ప్రమాదమూ లేకుండా కాపాడుతాను. ఇక్కడ నేను ఒంటరిగా ఉన్నానని, నాకు అపకారం చేయాలని మాత్రం ఆలోచించకండి. నా ఆత్మరక్షణలో నేనెప్పుడూ ఉంటూనే ఉంటాను" అంటూ కోటు జేబులోకి చేయి పోనిచ్చాడు రామానుజం. అక్కడ రివాల్వర్ ఉన్న విషయం తెలుస్తూనే ఉంది.

రమేష్, అనితల ముఖాలు వివర్ణమై పోయాయి.

"చూడండి- నా దగ్గర రివాల్వర్ ఉంది కనుక మిమ్మల్నేదో చేస్తానని భయపడకండి, నువ్వు బంగారుగుడ్లుపెట్టే బాతువి. చూస్తూ చూస్తూ నిష్కారణంగా నిన్ను చంపుకోను. మంచీ చెడూ ఆలోచించగలవాడివి కనుకనే మరోసారి హెచ్చరిస్తున్నాను. నాతో రాదలుచుకున్నావో పోలీసులకు చిక్కదలచుకున్నావో తేల్చుకో" అన్నాడు రామానుజం కర్కశంగా. అధికార స్వరంతో అతన్ని "నువ్వు" అనడం మొదలుపెట్టాడు.

రమేష్ అనిత వంక చూశాడు.

ఆమె దీనంగా చూస్తూ ఒప్పుకోమన్నట్లు తల ఆడించింది.

"సరే .... నీ ఇష్టం అలాగే కానీ" అన్నాడు రమేష్ అసహ్యాన్ని వెళ్ళగక్కుతూ. ఆ కోపం కొద్దీ తనుకూడా రామానుజాన్ని "నువ్వు" అనేశాడు.

అయితే కోట్లకోసం కలలు కంటున్న రామానుజానికి ఇదేమీ పట్టలేదు. రమేష్ నయాన

కాకపోయినా, భయాన్నయినా ఒప్పుకున్నాడు. అది చాలు ఆ మర్నాడే మూటా ముల్లె సర్దేసి అందరూ బయలుదేరారు.

* * * *

ఢిల్లీలో "మెట్రో కన్‌స్ట్రక్షన్స్" సంస్థ వెలిసింది. దాని సోల్ ప్రొప్రయిటర్ రామానుజం, రమేష్ రూపొందించిన హార్ట్ కోరల్‌కి "కోరలైట్" అని పేరు పెట్టారు. దానిని తయారుచేసే ఫ్యాక్టరీని ఢిల్లీ సివార్లలో స్థాపించారు. అక్కడ పనివాళ్ళు కోరలైట్‌ను భారీగా ఉత్పత్తి చేస్తుంటే దానికి అనుబంధంగా ఉన్న లేబొరేటరీలో తన పరిశోధనలు చేసుకుంటుండేవాడు రమేష్. అనిత అతనికి తోడుగా ఉండేది. వాళ్ళిద్దరూ పోలీసుల భయంతో అసలు బయటికి వెళ్ళేవారుకాదు.

రోజులు గడుస్తుంటే రామానుజం వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగింది. అచిరకాలంలోనే ఆ కోరలైట్ అసమాన ప్రచారం పొందింది. ఇళ్ళు కట్టడం దానితోనే, రోడ్లనిర్మాణం దానితోనే ఆ కోరలైట్ ఫార్ములా తెలుసుకోవాలని ఎన్నో విధాల ప్రయత్నించాడు రామానుజం. అది అతనికి తెలిస్తే రమేష్, అనితలకు నూకలు చెల్లినట్లే. ఈ విషయం వారికీ తెలుసు. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ రహస్యం బయటపెట్టే వాడు కాదు రమేష్.

ఇదిలా ఉండగా రామానుజానికి చాలా పెద్ద ఆర్డర్ వచ్చింది. కేంద్రప్రభుత్వం ఢిల్లీ సమీపంలో ఒక మోడల్ టౌన్‌షిప్‌ను నిర్మించాలని తలపెట్టింది. అందుకు కావలసిన పథకం రూపొందించి మొత్తం టౌన్‌షిప్‌ని కోరలైట్‌తో నిర్మించాలని నిర్ణయించింది. దాంతో కొన్ని వందల కోట్లు విలువచేసే ఆర్డరు రామానుజానికి వచ్చింది. తగినంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా ఇయ్యడంతో చాలా పెద్ద ఫ్యాక్టరీ పెట్టి ఇరవై నాలుగు గంటలూ పనిచేయించసాగాడు రామానుజం.

ఏడాది గడిచింది. టౌన్‌షిప్ నిర్మాణం పూర్తి అయింది. ఇంక దానిని లాంఛనంగా ఓపెన్‌చేసి ప్రజలకు అప్పజెప్పడమే తరువాయి. అయితే ప్రధానికి తీరిక లేనందువల్ల అందుకు తేదీ నిర్ణయం కాలేదు.

లాభాలు కోట్ల కొద్దీ వస్తున్నా రామానుజానికి సంతృప్తి అన్నది లేకపోయింది. కట్టు తెంచుకున్న పొగరు గిత్తలాగా అతని పేరాశ నిమిష నిమిషానికీ పెరిగిపోసాగింది. దాంతో రబ్బర్ ప్లాస్టిక్ వంటి మెత్తని కోరల్‌ని నిర్దుష్టంగా తయారుచేయమని రమేష్‌మీద ఒత్తిడి తీసుకురాసాగాడు. పరిశోధన అనేది తొందర పెట్టే అయ్యేది కాదని ఎంత నచ్చజెప్పినా అతని వ్యాపార బుద్ధికి ఎక్కేది కాదు. చివరికి ఒక నెల రోజులలోగా ఆ పరిశోధన పూర్తి చేయకపోతే రమేష్ రహస్యం పోలీసులకి చెప్తానని బెదిరించాడు కూడా.

రమేష్‌కి ఈ దినదిగన గండంతో ప్రాణం విసిగిపోయింది. తాను జైలుకి వెళ్లవలసి వస్తుందని భయపడుతున్నాడే కాని ఇప్పుడు మాత్రం తాను బంధిఖానాలో గడపడం లేదూ! తాను కాని తన భార్య కాని ధైర్యంగా బయటికి వెళ్లగలుగుతున్నారా? ఎవరితోనైనా మాట్లాడగలుగుతున్నానా? ఐదేళ్ల అజ్ఞాతవాసం తర్వాత రాకరాక ఒక్క మనిషి- రామానుజం వస్తే - దాని ఫలితం సాలెగూట్లో చిక్కుకున్నట్లయింది. ఇంతకంటే పోలీసులకే లొంగిపోయి జైలు శిక్ష అనుభవించడమే మేలు పైగా రామానుజం పెట్టిన గడువు ఇంక నాలుగు రోజులే ఉంది. అంతలోగా తన పరిశోధన పూర్తి కాకపోతే పోలీసులకేమీ అప్పజెప్పడు-

అప్పజెప్తే అతనికే నష్టం. కాని పీడించడం విసిగించడం, వేధించడం ఎక్కువవుతుంది.

ఆ రోజు రామానుజం కంపెనీ పనిమీద కలకత్తా వెళ్లాడు. మర్నాటికి కాని రాడు. ఇదే తగిన అదననుకున్నాడు రమేష్. భార్యతో విషయం అంతా చర్చించాడు. పోలీసులకి లొంగిపోవడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చారు ఇద్దరూ.

రమేష్ భార్యతో కలిసి సెంట్రల్ సి.బి.ఐ ఆఫీసుకి వెళ్లాడు. అక్కడే తను కేసుకి సంబంధించిన ఆఫీసర్‌ని కలుసుకుని తన గురించి తన కేసు గురించీ చెప్పి తాను పోలీసులకు లొంగిపోవడానికి వచ్చానని చెప్పాడు.

ఆఫీసర్ ఆ కేసుకి సంబంధించిన ఫైల్ తెప్పించాడు.

ఆ ఫైల్‌ని శ్రద్ధగా చూసి రమేష్ వంక తిరిగి "మిస్టర్ రాజారావు యు ఆర్ ఎగ్జానరేటెడ్" అన్నాడు.

ఆయన అంటున్నదేమిటో రమేష్‌కి అర్థం కాలేదు. తన చెవులని తానే నమ్మలేకపోయాడు. నోరు వెళ్లబెట్టి ఆయన వంకే చూడసాగాడు.

"యస్. మిస్టర్ రాజారావు. ఈ కేసు మొదలైన ఒక నెల రోజుల్లోనే మా వాళ్లు మీ మేనేజింగ్ పార్టనర్ గుప్తాని అరెస్టు చేశారు. ఆయన జరిగిన దానికి పూర్తి బాధ్యత తానే స్వీకరించాడు. మీరు మరికొందరు పార్టనర్స్‌కి ఏ సంబంధమూ లేదని, నిర్దోషులనీ స్టేట్‌మెంట్ ఇచ్చాడు. కల్తీ సిమెంట్ సప్లయి చేసిన డీలర్స్‌నీ, కక్కుర్తిపడ్డ సబ్‌కంట్రాక్టర్స్‌నీ బయటపెట్టాడు. వాళ్లని అరెస్ట్ చేసి ప్రొసీడ్ అవడం జరిగింది. ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా మిమ్మల్ని నిర్దోషులగా భావించి వాంటెడ్ లిస్టులోనుంచి తొలగించాం" అంటూ వివరించాడు సి.బి.ఐ ఆఫీసర్.

తన చెవులని నమ్మలేకపోయాడు రమేష్. ఉద్వేగం ఆపుకోలేక ఏడ్చేశాడు. అనిత కూడా ముఖం మీద రుమాలు కప్పుకుని దుఃఖించింది.

కొంచెం తేరుకున్నాక "థాంక్యూసార్" అంటూ లేచి నుంచున్నాడు రమేష్.

"ఆ మీరు రేపు ఈ సమయానికి రండి. మీ మీద ఏ విధమైన కేసూ లేదని రాతపూర్వకంగా ఇస్తాను. ఆ డాక్యుమెంట్ దగ్గరుంటే మీకు ఎప్పటికీ భయముండదు" అన్నాడు ఆ ఆఫీసర్.

ఆయనకి ధన్యవాదాలు చెప్పి ఇద్దరూ బయటికి వచ్చారు.

తాము అనవసరంగా తమ నీడని చూసి భయపడి నిష్కారణంగా ఐదేళ్లుపైగా అజ్ఞాతవాసం చేశారన్నమాట. అయితే తాము అజ్ఞాతంలో ఉండడం మూలంగా రామానుజం కావాలనే ఇలా బెదిరించి తన పబ్బం గడుపుకున్నాడన్న మాట. ఆ విషయం తలుచుకోగానే అతని పీక నులిమి చంపివేయాలన్నంతకోపం వచ్చింది రమేష్‌కి.

ఏమైతేనేం ఇన్నాళ్లకి చెరవదిలింది. రేపు రామానుజానికి అతని ఉద్యోగానికీ గుడ్‌బై చెప్పి, కావాలనుకున్నచోటికి వెళ్లిపోవచ్చు.

* * * *

మర్నాడు మధ్యాహ్నం రమేష్ అనితతో కలిసి ఆ డాక్యుమెంట్ తీసుకోడానికి సి.బి.ఐ ఆఫీసుకి

వెళ్లాడు. కలకత్తాలో పని తొందరగా అయిపోవడంతో ఆ రాత్రికి రావలసిన రామానుజం మధ్యాహ్నానికే వచ్చేశాడు. తిన్నగా రమేష్ కోసం వెళ్ళాడు. రమేష్ లేబొరేటరీకి తాళం వేసి ఉంది. క్రిందటి రోజు రమేష్, అనితా ఎక్కడికో వెళ్లారనీ, ఈ రోజు కూడా ఒక గంట ముందు వెళ్లారనీ, లేబొరేటరీ అసలు తెరవనే లేదని బాయ్ చెప్పాడు.

రామానుజం మనసు కీడుని శంకించసాగింది. "వీళ్లిద్దరూ ఎక్కడికి పోయారబ్బా? ఒకవేళ తప్పించుకుపోలేదు కదా!" అనుకున్నాడు.

"ఎలా పారిపోతారు పోలీస్ కేసు మీద పెట్టుకుని!" అని తానే సమాధానం చెప్పుకున్నాడు.

ఎదురుగుండా కిటికీ ఊచలకి సాలీడు గూడుకట్టింది. ఏమీ ఎరుగని ఈగవచ్చి అందులో చిక్కుకుంది. బయటికి పోవాలని గింజుకొన్నకొద్దీ మరింత బిగుసుకుపోతోంది. ఇదంతా ఆనందంగా చూస్తున్న సాలీడు ఆ ఈగని తినడానికి ప్రయత్నిస్తోంది. ఇంతలో గింజుకుంటున్న ఈగ దారాల్ని తెంపుకొని జుయ్యిమని ఎగురుతూ వెళ్లిపోయింది. దారాలలో గట్టి తక్కువయిందో! ఈగ శక్తే ఎక్కువయిందో!

ఈగ ఎగిరిపోడాన్ని ఆశ్చర్యంగా చూస్తుండిన రామానుజానికి మరో ఆశ్చర్యం ఎదురయింది.

పారిపోతున్న ఈగను పట్టుకోవాలన్న ఆత్రంతో కాబోలు వడివడిగా వెళ్తున్న సాలీడు తన గూట్లో తానే చిక్కుకుని గింజుకోసాగింది.

సాలీళ్లు చాలా తెలివిగా గూళ్లను కట్తాయి. అవి వేసిన దారాలు కొన్నింటికి జిగురును పూస్తాయి. కొన్నింటికి పూయవు. జిగురు అంటిన దారాలు తగిలిన దోమలూ, ఈగలూ చిక్కుకుపోతే, జిగురులేని దారాలమీద నుంచి జాగ్రత్తగా పాక్కుని వెళ్లి వాటిని భక్షిస్తుంది సాలీడు. పొరబాటున జిగురువున్న దారాల మీద సాలీడు పాకితే అదికూడా సొంత గూటిలో చిక్కుకుపోతుంది. కాని అలా జరగడం అతి అరుదు. ఈ విషయాలు తెలిసిన రామానుజం ఆ సాలీడుని చూస్తూ "ఇంత తెలివిగల సాలీడూ సొంతగూటిలో ఎలా ఇరుక్కొందో" అని ఆశ్చర్యపోసాగాడు.

ఇంతలో అతనికి అనిపించింది. ఈ ఈగలాగే రమేష్ కూడా తన గూటినుంచి ఎగిరిపోలేదు కదా అని. ఎందుకైనా మంచిదని వెంటనే వెతకడానికి బయలుదేరాడు రామానుజం.

ఢిల్లీ శివార్లలో రామానుజం ఫ్యాక్టరీ ఉన్న ప్రాంతంలో యాసిడ్ ఫ్యాక్టరీలు, కెమికల్ ఫ్యాక్టరీలు చాలా ఉన్నాయి. వాటినుంచి సల్ఫర్‌డై ఆక్సయిడ్, హైడ్రోజన్ సల్ఫయిడ్, మిథేన్ వంటి ఘాటైన వాయువులు మధ్య మధ్య వెలువడి వాతావరణంలో కలిసిపోతుంటాయి. అలాగే నైట్రిక్ యాసిడ్, హైడ్రోక్లోరిక్ యాసిడ్ వంటి ఘాటైన ఆమ్లాల ఆవిరులు కూడా అప్పుడప్పుడూ బయటకు వచ్చి గాలిలో కలుస్తుంటాయి. వర్షం కురిసినప్పుడు వీటిలో కొంత భాగం వానతో తిరిగి నేలమీద జేరుతాయి. ఇటువంటి వర్షాన్ని యాసిడ్ రైన్ అంటారు. దీనివల్ల కూడా కాలుష్యం ఏర్పడుతుంటుంది.

ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముకోసాగాయి. పెద్ద వర్షం వచ్చే సూచనలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. రమేష్‌కోసం వెతుకుతున్న రామానుజం కారు తాను కట్టిన కోరలైట్ టౌన్‌షిప్‌కు వెళ్తోంది. ఆ మబ్బుల రంగు వెలుగు, ఆ కోరలైట్ కట్టడాల రంగుకి బాగా మాచ్ అయి మొత్తం ప్రకృతి అంతటికీ ఒక వింత అందం సంతరించింది. తన విజయానికి ఒకవైపు మురిపిపోతున్నా రమేష్ గురించిన ఆందోళన రామానుజం మనసుకి శాంతి లేకుండా చేస్తోంది.

వర్షం సన్నగా మొదలైంది. అదే టౌన్‌షిప్ కట్టాక పడ్డ మొదటివాన. అంతలో అది పెద్ద వానగా మారింది. టౌన్‌షిప్‌లో జనం ఇంకా నివాసం ఏర్పరచుకోకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. విండో గ్లాసెస్ మూసేసి, నున్నని కోరలైట్ రోడ్లమీద వేగంగా కారుని నడపసాగాడు రామానుజం. సి.బి.ఐ ఆఫీసులో కావలసిన డాక్యుమెంట్స్ తీసుకుని రమేష్ అనితతో తిరిగివస్తున్నాడు. అతనూ టౌన్‌షిప్‌లో ప్రవేశించాడు.

దూరాన్నుంచి వస్తున్న కారు కనిపించింది.

"అరే...ఈయన అప్పుడే వచ్చేసినట్లున్నాడే" అన్నాడు రమేష్.

"రానీండి, మనకేం భయం. ఎలాగూ ఈ రోజుతో ఆయనకి గుడ్‌బై చెప్పదలుచుకున్నాం" అంది అనిత.

"అవుననుకో. కాని అంత త్వరగా వదుల్తాడా అని" నసిగాడు రమేష్. ఇంతలో రమేష్ కారు గోతుల మీంచి పోతున్నట్లు ఎగిరెగిరి పడసాగింది.

"ఇదేమిటబ్బా...నున్నగా ఉన్న ఈ కొత్త రోడ్లమీద ఈ కుదుపులేమిటి?" అని ఆశ్చర్యపోతున్న రమేష్‌కి కారు అద్దంలోంచి కట్టెదుట కన్పించిన దృశ్యం, కొయ్యబారిపోయేటంతటి విభ్రాంతిని కల్గించింది. కోరలైట్‌తో వేసిన రోడ్లు గుడారాలుపైకి లేచినట్లుగా పైకి లేస్తున్నాయి. క్రిందనుంచి వాటిని ఏదో పైకి నెట్టుతున్నట్లుగా పైకి లేస్తున్నాయి అవి.

"అటు చూడండి" అని భయంతో అరిచింది అనిత. ఎదురుగా. దూరాన ఉన్న ఇళ్లు అన్నీ మామూలువీ, మల్టీ స్టోరీడ్‌వి అన్నీ నీటిలో నానేసిన శనగగింజ ఉబ్బినట్లు నీరు తగిలిన స్పాంజి పెద్దదైనట్లు అన్నివైపులా పెరిగిపోతూ కనిపించాయి. అవన్నీ కూడా కోరలైట్‌తో కట్టిన ఇళ్లే. ఎదురుగా ఉన్న రోడ్డు అలలు అలలుగా పడుతూ లేస్తూ పాములాగా మెలికలు తిరిగిపోతోంది. అటుపైన ఇళ్లు అన్ని వైపులా పెరిగిపోతూ ఊగిపోతున్నాయి. ఆ దృశ్యం చూస్తుంటే నగరం యావత్తూ పైశాచికంగా కరాళ నృత్యం చేస్తున్నట్లనిపిస్తోంది.

"ఓ....కోరల్‌కి ప్రాణం వచ్చిందన్నమాట. యాసిడ్ రెయిన్‌తో జీవశక్తి మేల్కొంది. అందుకే ఎదిగిపోతోంది. కోరలైట్‌కి దూరంగా పోవాలి మనం" అంటూ కారుని వెనక్కి తిప్పాడు రమేష్.

వాన స్థిరంగా కురుస్తూనే ఉంది.

దూరాన్నుంచి రామానుజం కారు ఎగిరెగిరి పడుతూ వస్తోంది. అతనూ రమేష్ కారుని చూశాడు. తనని తప్పించుకొని పోతున్నాడనుకుని తన కారు వేగం పెంచి వెంటాడసాగాడు. అంతలో పెద్ద చప్పుడుతో ఫెళఫెళా శబ్దం చేస్తూ రోడ్డుకి అటూ ఇటూ ఉన్న రెండు పెద్ద మల్టీస్టోరీడ్ బిల్డింగ్స్ కుప్పకూలి రోడ్డుకి అడ్డంగా పడ్డాయి. ఆ పడడం పడడం రామానుజం కారు మీద పడ్డాయి.

అంతే. రామానుజం కారుతో సహా నుగ్గనుగ్గయిపోయాడు.

సాలీడు తన గూట్లోనే చిక్కుకుని ప్రాణం పోగొట్టుకుంది.

ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, జూలై 1987 ✪